# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

epaper.manachourasta.com

సంపుటి : 01 | సంచిక : 23 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం, 19 డిసెంబర్ 2025 | పేజీలు : 04




అల్లు అర్జున్ సిస్టర్‌గా

## మృణాల్

4 లో



తూర్పు అభివృద్ధే

## లక్ష్యం

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- రూ.2.68 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి

3 లో

క్రీడలతో శారీరక

## దృఢత్వం

- విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

2 లో





కోర్టు తీర్పు మోడీ, అమిత్ షాకు

## చెంపపెట్టు

- డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి
- బీజేపీ తీరుపై కాంగ్రెస్ నిరసన
- జనగామలో దిష్టిబొమ్మ దహనం

3 లో







# క్రీడలతో శారీరక దృఢత్వం

- విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలను పెంపొందించాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, మన చౌరాస్తా:** క్రీడలతో క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం పెంపొందుతుందని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో జనగామ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో గురువారం 11వ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన, జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం టార్చ్ రిలేను వెలిగించి క్రీడా పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా..... విద్యార్థుల నుంచి కలెక్టర్ మార్చ్ పాస్ట్ వందనం స్వీకరించిన అనంతరం.. రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మీట్స్ కు వచ్చిన విద్యార్థులను అభినందించారు. జనగామ జిల్లాలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించుకోవడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడమే కాకుండా నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేస్తాయని తెలిపారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని, అందరూ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబర్చాలని సూచించారు. ప్రిన్సిపాళ్లు, సిబ్బంది విద్యార్థులను సమర్థంగా చూసుకోవాలని, పీడి లు నిష్పక్షపాతంగా పోటీలను నిర్వహించాలని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనే లక్ష్యంతో విద్యార్థులు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గురుకులాల నుంచి ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన పూర్ణ ఆనంద్ వంటి ఆదర్శ వ్యక్తులను మార్గదర్శకులుగా తీసుకొని క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈకార్యక్రమంలో టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ జాయింట్ సెక్రటరీ బి. సక్రు నాయక్, డీఎస్‌సీడీవో డాక్టర్ బి.విక్రమ్, డీఐఈవో కే. జితేందర్ రెడ్డి, ఎంఈవో జి.శంకర్ రెడ్డి, మల్టీజోన్-1 ఆఫీసర్ హెచ్. అరుణకుమారి, జోనల్ ఆఫీసర్-5 ఎస్. విద్యారాణి, ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ అలగోని నరసింహులు గౌడ్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్లు జి. శ్రీనివాస్, డి.కిషన్ తదితరులు పాల్గొన్నారు.









## దేవతలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

**జనగామ, మన చౌరాస్తా :** ఇటీవల ఆన్‌లైన్‌లో క్లబ్ హౌస్ అనే ఆప్ బ్రాడ్కాస్ట్ లో రాపర్ మనోజ్ అనే వ్యక్తి తరచూ హిందూ దేవతలు, అయ్యప్ప, దుర్గామాత, గణపతి వంటి దేవుళ్లను కించపరుస్తూ అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్నాడని ఆ వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని జనగామ జిల్లా విశ్వహిందూ పరిషత్ సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం సీఐ సత్యనారాయణ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. అందుకు సీఐ స్పందిస్తూ చట్టరీత్యా తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి మోహనకృష్ణ భార్గవ మాట్లాడుతూ హిందూ దేవతలను కించపరచేలా అసభ్యకర పదజాలంతో దుర్భాషలాడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటివి జరుగకుండా గుణపాఠంగా నిలవాలని కోరారు. హిందువుల జోలికి వచ్చిన, దేవతలను కించపరిచే ప్రయత్నం చేసినా విశ్వహిందూ పరిషత్ ఉపేక్షించదని అన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు బచ్చు బాలనారాయణ, సహా కార్యదర్శి చిలువేరు హర్షవర్ధన్, భజరంగ్ దల్ కోకన్వీనర్ సాయితేజ, భార్గవ తదితరులు పాల్గొన్నారు.



## మల్లన్నను దర్శించుకున్న అడిషనల్ కలెక్టర్

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ గురువారం మల్లికార్జున స్వామి వారి దేవాలయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు . ఆలయ పర్యవేక్షకులు చంద్రశేఖర్, ఆర్ ఐ శ్రీనివాస్, ఆలయం ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ముఖ్య అర్చకులు ఆంజనేయులు, మనోహర్ పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో నిరసన



**జనగామ, మన చౌరాస్తా :** ఈ పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేయాలని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కౌలే జగన్నాథం, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మద్దోజు గంగాభవానీ, బీసీ సంఘం రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు మనీమంజరి, రాజేశ్వరి వెంకటలక్ష్మి, జాజుల లింగంగౌడ్, భాస్కర్, అనంతోజు బ్రహ్మాచారి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




# కోర్టు తీర్పు మోడీ, అమిత్ షాకు చెంపపెట్టు లాంటిది

- **డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లకావత్**

**జనగామ, మన చౌరాస్తా :** నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ దాఖలు చేసిన ఫిర్యాదును కోర్టు కొట్టివేయడం నరేంద్ర మోడీ, అమిత్ షాలకు చెంపపెట్టు లాంటిది అని జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ధన్వంతి లకావత్ అన్నారు. బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా మోడీ, అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ధన్వంతి మాట్లాడుతూ ఈ కేసులో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవని, ట్రాన్సాక్షన్లు లేవని కోర్టు స్పష్టంగా పేర్కొన్నట్లు ఆమె తెలిపారు. ప్రాపర్టీ ట్రాన్స్ ఫర్ గానీ, అక్రమ ఆస్తుల గానీ లేవని కోర్టు స్పష్టం చేయడంతో, బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులపై చేస్తున్న తప్పుడు కేసులు మరోసారి బహిర్గతమయ్యాయని అన్నారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీ గారిపై కక్ష సాధింపు రాజకీయాలే లక్ష్యంగా ఈడీ ద్వారా కేసులు నమోదు చేశారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ, ఈసీ వంటి రాజ్యాంగ సంస్థలను రాజకీయ ఆయుధాలుగా మార్చిందని తీవ్ర విమర్శలు చేశారు. కోర్టు ఈడీకి చివాట్లు పెట్టిన బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి రావడం లేదన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ఆరోపణలు చేయడం బీజేపీకి అలవాటుగా మారిందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, పట్టణ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్ , మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి శివ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంగాల కళ్యాణి, డాక్టర్ రాజమౌళి, సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకర శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధికార ప్రతినిధి మేడ శ్రీనివాస్, రాష్ట్ర మైనారిటీ నాయకులు జమాల్ షరీఫ్, రాష్ట్ర నాయకులు ఉడత రవి యాదవ్, మహిళా సంఘం అధ్యక్షులు జిల్లా అధ్యక్షురాలు బడికే ఇందిర, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లొక్కుంట్ల ప్రవీణ్, మైనార్టీ సెల్ జాఫర్ షరీఫ్, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల సమ్మయ్య, డీసీసీ ప్రధాన కార్యదర్శి వంగాల మల్లారెడ్డి, ఆలేటి సిద్దిరాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతోనే ఎన్నికలు ప్రశాంతం

- **వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**




**హనుమకొండ, మన చౌరాస్తా :** అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించడంతో పంచాయితీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని సీపీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గ్రామ పంచాయితీ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో డీసీపీలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, కవిత వరంగల్ పోలీస్ కమిషనర్ ని మర్యాద పూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేసి.. శుభాకాంక్షలు తెలియజేసారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ డీసీపీ నుంచి మొదలుకొని హోంగార్డ్ స్థాయి వరకు అందరూ ఎన్నికలు ప్రకటన తేది నాటి నుండి ప్రణాళిక ప్రకారం పనిచేయడంతో పాటు పోలింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జరిగాయన్నారు. బందోబస్త్ నిర్వహించి ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయడంలో కీలకంగా నిలిచిన పోలీస్ కమిషనర్ అధికారులు, పోలీస్ సిబ్బందిని అభినందనలు తెలియజేసారు.



# అభివృద్ధే నా లక్ష్యం

- **మంత్రి కొండా సురేఖ**

**వరంగల్, మన చౌరాస్తా :** నియోజకవర్గ అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం నిరంతరంగా పనిచేస్తోందని రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం వరంగల్ (తూర్పు) నియోజకవర్గ పరిధిలోని 38, 39 డివిజన్లలో రూ.2 కోట్ల 68 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 38వ డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించామని తెలిపారు. ఖిలా వరంగల్ ఈద్గా మరమ్మతుల కోసం గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే రూ.కోటి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు గుర్తు చేశారు. ఈద్గా ప్రాంగణంలో నీరు నిలిచిపోతున్న సమస్యను పరిష్కరించేందుకు పూర్తి స్థాయి ఫ్లోరింగ్ పనులు చేపట్టి సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. 37వ డివిజన్ ఎం.ఎం. నగర్‌లో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారు ఆహ్వానం మేరకు ఇంటి ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు సాధారణ గృహాల మాదిరిగానే చక్కగా నిర్మించబడుతున్నాయని, కొందరు లబ్ధిదారులు తమ సొంత ఖర్చుతో ఇళ్లను మరింత విశాలంగా నిర్మించుకున్నారని మంత్రి ప్రశంసించారు. నిర్మాణంలో ఉన్న ఇతర ఇళ్లను కూడా ఆమె పరిశీలించారు.

## అర్హులందరికీ ఇండ్లు

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తులు స్వీకరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తున్నారని మంత్రి తెలిపారు. వరంగల్ (తూర్పు) నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇళ్లలో ఇప్పటికే పెద్ద సంఖ్యలో లబ్ధిదారులకు ఇళ్లు అందించినట్లు వెల్లడించారు. ఎల్1 జాబితాలో ఉన్నవారికి మంజూరు కొనసాగుతుందని, ఎల్2లో ఉన్న నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు అనంతరం మరమ్మత్తులు చేపడతామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును మేయర్, కలెక్టర్, కమిషనర్‌లతో సమన్వయం చేసుకొని కార్పొరేటర్లతో చర్చించి పరిష్కరిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. కోట్లాది రూపాయల నిధులు ఇప్పటికే అభివృద్ధి పనులకు మంజూరు చేశామని, భవిష్యత్తులో మరిన్ని నిధులు విడుదల చేస్తామని చెప్పారు. త్వరలో మరిన్ని శంకుస్థాపనలు నిర్వహిస్తామని తెలిపారు.

## సీఎం పర్యటన త్వరలో..

వరంగల్ ఎయిర్‌పోర్ట్ సమస్య దాదాపు పరిష్కారమైందని, జనవరి మొదటి లేదా రెండో వారంలో ముఖ్యమంత్రి నగరానికి వచ్చి పలు ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. సమీకృత కలెక్టర్ కార్యాలయ నిర్మాణం పూర్తయిందని, పెండింగ్ సమస్యలను గుర్తించి ముఖ్యమంత్రిని ఆహ్వానించి వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డీఆర్ఓ విజయలక్ష్మీ, కార్పొరేటర్లు బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్, భోగి సువర్ణ సురేష్, బస్వరాజు కుమారస్వామి, కావేటి కవిత, ఎస్ఈ సత్యనారాయణ, ఏసీపీ శుభమ్ తదితరులు పాల్గొన్నారు.



# అల్లు అర్జున్ సిస్టర్‌గా మృణాల్ ఠాకూర్?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే భారీ చిత్రంపై బన్నీ ఫ్యాన్స్‌తో పాటు సినీ ఇండస్ట్రీలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుంచే అధికారిక అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో క్రేజీ టాక్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ కీలక పాత్రలో కనిపించనున్నట్టు ఇప్పటికే వార్తలు వచ్చాయి. అయితే తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మృణాల్ ఠాకూర్ ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు సిస్టర్ రోల్‌లో నటించబోతున్నారట. ఈ పాత్ర కథలో చాలా కీలకమైనదిగా, బలమైన ఎమోషనల్ టోన్‌తో సాగుతుందని టాక్. అన్న చెల్లెల్ల మధ్య బంధం, భావోద్వేగాలను అట్లీ తన మార్క్ స్టైల్‌లో చూపించబోతున్నాడని, ఈ పాత్ర ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేస్తుందని అంటున్నారు. అయితే ఇది అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. నిజంగా మృణాల్ సిస్టర్ రోల్‌లో కనిపిస్తారా? లేక మరో షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో వస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.ఇక ఈ సినిమాకు సంబంధించిన మరో హైలైట్ ఏమిటంటే.. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకోణె ఇందులో మెయిన్ హీరోయిన్‌గా నటించనుండగా, జాన్వీ కపూర్ మరో కీలక హీరోయిన్ పాత్రలో కనిపించనుంది. ఒకే సినిమాలో ఇంతమంది స్టార్ హీరోయిన్లు ఉండటం వల్ల ఈ ప్రాజెక్ట్‌పై మరింత క్రేజ్ పెరుగుతోంది.కథ విషయానికి వస్తే.. మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో ఓ డాన్ చుట్టూ తిరిగే పవర్‌ఫుల్ కథను అట్లీ సిద్ధం చేశాడట. యాక్షన్, ఎమోషన్, డ్రామా అన్నీ సమపాళ్లలో ఉండేలా స్క్రిప్ట్‌ను రూపొందించినట్టు సమాచారం. అల్లు అర్జున్‌ను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని విధంగా, ఒక కొత్త షేడ్స్ ఉన్న పాత్రలో చూపించేందుకు అట్లీ ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్టు తెలుస్తోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను సన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ వ్యాల్యూస్ విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా, హాలీవుడ్ రేంజ్‌లో సినిమాను తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారట. అంతేకాదు, ఈ సినిమాలో కొన్ని ప్రత్యేక గెస్ట్ రోల్స్ కూడా ఉండబోతున్నాయని టాక్. వాటి కోసం అట్లీ పలువురు స్టార్ నటులను సంప్రదించనున్నారని సమాచారం. ఆ గెస్ట్ రోల్స్‌లో ఎవరు కనిపిస్తారన్నది మరో ఆసక్తికర అంశంగా మారింది.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**